సాక్షి
రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 25 । ఏప్రిల్ । 2023



ఐలమ్మ విగ్రహానికి క్షీరాభిషేకం

ముస్తాబాద్(సిరిసిల్ల): పోతుగల్‌లోని చాకలి ఐలమ్మ విగ్రహానికి బీజేపీ నాయకులు సోమవారం క్షీరాభిషేకం చేశారు.



మిడ్‌మానేరు పరిసరాల్లో మొక్కలు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టు కట్ట పరిసరాల్లో మొక్కల పెంపకానికి సోమవారం అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్ స్థలాన్ని పరిశీలించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0/25.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ప్రజాసంఘాలపై అణచివేత సరికాదు



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న విమలక్క

సిరిసిల్లటౌన్: ప్రజాసంఘాలను అణచివేసే చర్యలు అప్రజాస్వామికమని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉమ్మడి రాష్ట్రాల చైర్‌పర్సన్ విమలక్క పేర్కొన్నారు. సిరిసిల్లలో ఈనెల 26న నిర్వహిస్తున్న ప్రజా ఉద్యమకారులు, కళాకారుల బహిరంగసభ పోస్టర్‌లను సోమవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ప్రజా ఉద్యమాలు చేస్తున్న మాపై జనశక్తి పార్టీ ముద్రవేసి కేసులు నమోదు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జైలులో ఉన్న కూర రాజన్నపై కామారెడ్డి ఠాణాలో కేసు నమోదు చేయడం సరికాదన్నారు. బీడీ కార్మికులను రోడ్డుపాలు చేసే చట్టాలను వెనక్కి తీసుకోవాలని కోరారు. ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో సిరిసిల్ల పద్మనాయక ఫంక్షన్‌హాల్‌లో ఈ సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వివిధ సంఘాల నాయకులు రాజేశ్వరీ, సంతోష్, రేణుక, పోకల సాయికుమార్, తేజస్వి, వెంకటేశ్, నేహా, శివ పాల్గొన్నారు.

చెరువులు పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



సారంపల్లి చెరువును పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని సారంపల్లి, జిల్లెల్ల గ్రామాల్లోని చెరువులను సోమవారం అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. చెరువుకట్టల పక్కన మొక్కలు నాటేందుకు అనువైన స్థలాన్ని చూశారు. అడిషనల్ డీఆర్‌డీవో సీహెచ్ మదన్‌మోహన్, ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాస్‌రావు, సెక్షన్ ఆఫీసర్ భూలక్ష్మి, ఏపీవో రాపోలు నాగరాజు, జేఈ రాజనర్సు, టీఏలు లక్ష్మణ్, మనోహర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడితే అరెస్టులా ?



మాట్లాడుతున్న చొక్కాల రాము

వేములవాడఅర్బన్: ప్రజల సమస్యలపై పోరాడుతుంటే అక్రమంగా అరెస్టు చేయడం ఏంటని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము ప్రశ్నించారు. వేములవాడ నందికమాన్ వద్ద పార్టీ ఆఫీస్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రం లీకేజీ విషయంలో సిట్ అధికారులను కలిసి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తున్న వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను అరెస్ట్ చేయడం ప్రభుత్వం చేతగాని తనమని విమర్శించారు. జింక ఎల్లయ్య, కుమ్మరి అనిల్, చొక్కాల ప్రశాంత్, మహిపాల్, శ్రీకాంత్, దేవరాజు ఉన్నారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సంపత్

చందుర్తి(వేములవాడ): సీపీఆర్(కార్డియో పల్మోనరీ రిసస్సిటేషన్)పై అవగాహన ఉండాలని చందుర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి సంపత్ కోరారు. చందుర్తి మండల పరిషత్‌లో సోమవారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. వైద్యుడు సంపత్ మాట్లాడుతూ గుండెపోటుకు గురైన వ్యక్తికి సత్వరమే సీపీఆర్ అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ఎమర్జెన్సీ సమయంలో సీపీఆర్ చేయకపోతే ఐదు నిమిషాల్లోపు బ్రెయిన్‌డెడ్ అయ్యే అవకాశం ఉందన్నారు. పెద్ద వయస్సు వారికి 30 సార్లకు పైగా సీపీఆర్ చేయాలని సూచించారు. జెడ్పీటీసీ నాగం కుమార్, ఎంపీపీ బైరగోని లావణ్య, రుద్రంగి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఏనుగుల శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో రవీందర్ ఉన్నారు.

బోయినపల్లి(వేములవాడ): బోయినపల్లి మండల పరిషత్‌లో సోమవారం సర్పంచులు, ఎంపీటీసీలకు సీపీఆర్‌పై డాక్టర్ రామకృష్ణ అవగాహన కల్పించారు. ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, తహసీల్దార్ నరేశ్, ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, సెస్‌డైరెక్టర్ కె.సుధాకర్ ఉన్నారు.

మళ్లీ ప్రకృతి బీభత్సం

ఇతను కోనరావుపేట మండలంలోని బావుసాయిపేటకు చెందిన నక్క మల్లేశం. ఇతను ఆరు ఎకరాలలో పొలం వేశాడు. అక్కడే కోళ్లఫారం ఉంది. వడగండ్ల వాన, గాలితో కోళ్లఫారం నేలమట్టమైంది. షెడ్డు ధ్వంసమైంది. ఆరు ఎకరాల పొలం నేలవాలింది. గింజలు రాలిపోయాయి. అటు కోళ్ల ఫారమ్ పోయి, ఇటు పొలం నష్టం కావడంతో మల్లేశం ఆర్థికంగా నష్టపోయాడు.



పొలంలో రాలిన వడ్లను చూపిస్తున్న ఇతను వంగపెల్లి నాగరాజు. కోనరావుపేట మండలం కనగర్తికి చెందిన నాగరాజు నాలుగెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశారు. రూ.లక్షన్నర వరకు పెట్టుబడి పెట్టాడు. రెక్కల కష్టాన్ని ఆరు నెలలపాటు ధార పోశాడు. మొన్న కురిసిన వడగండ్ల వానకు మూడెకరాల్లో వడ్లు రాలిపోయాయి. అంతా బాగుంటే 140 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. ప్రస్తుతం 50 క్వింటాళ్ల ధాన్యం కూడా వచ్చేలా లేదు.





తడిసిన ధాన్యాన్ని చూపుతున్న ఇతను బోయిని నర్సయ్య. వీర్నపల్లికి చెందిన నర్సయ్య ఆరు ఎకరాల్లో వరి వేశాడు. ముందే నాట్లు వేయడంతో త్వరగా కోతకు వచ్చింది. వరిపంట కోసి.. ఆరబోశాడు. అకాల వర్షంతో అమ్మకానికి సిద్ధంగా ఉన్న వడ్లు కల్లంలోనే తడిసి ముద్దయ్యాయి. వర్షం నీళ్లలో వడ్లు మొలకలు వచ్చే పరిస్థితి ఎదురైంది. ఆ వడ్లను మళ్లీ ఆరబెట్టేందుకు మరో వారం కష్టపడాల్సి వస్తుంది. యాసంగి సాగు కోసం రూ.2 లక్షల వరకు పెట్టిన పెట్టుబడి చేతికి అందే పరిస్థితి లేదు.

- జిల్లాలో గాలి..వాన.. దుమారం
- వరి నేలమట్టం.. రాలిన మామిడికాయలు
- మెత్తపడిన మిర్చి
- ఆరు నెలల శ్రమఫలం వర్షార్పణం



మామిడికాయల కుప్ప వద్ద ఉన్న ఇతను తీగల శ్రీనివాస్. రుద్రంగికి చెందిన శ్రీనివాస్ 9 ఎకరాల మామిడితోటను రూ.5లక్షలకు లీజుకు తీసుకున్నాడు. మూడు రోజుల కిందట కురిసిన గాలివానకు మామిడికాయలు నేలరాలాయి. మొత్తం కాయలు అమ్మితే రూ.2 లక్షలు వచ్చే పరిస్థితి లేదని శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాథమిక అంచనాలు రూపొందించాం



జిల్లాలో జరిగిన పంట నష్టాలను ప్రాథమికంగా అంచనాలు వేశాం. మూడు రోజులుగా నిత్యం గాలి, వాన కొడుతుంది. రెవెన్యూ అధికారులతో కలిసి జిల్లాలో జరిగిన నష్టంపై పంటల వారీగా వివరాలు సేకరించి, ప్రభుత్వానికి నివేదిస్తాం. ఇప్పటికైతే ప్రాథమిక అంచనా ప్రకారం వివరాలు సిద్ధం చేశాం.

– రణధీర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

సిరిసిల్ల: అన్నదాతలపై ప్రకృతి మళ్లీ కన్నెర్రజేసింది. జిల్లాలో సోమవారం సాయంత్రం గాలి.. వాన రావడంతో వరిపంట నేలకూలింది. మామిడి కాయలు రాలిపోయాయి. అతివేగంతో వీచిన గాలులకు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలమట్టమయ్యాయి. కోతకొచ్చిన వరి గొలుక వాల్చి.. నేలపాలైంది. కాపుకొచ్చిన మామిడికాయలు రాలిపోయాయి. ఆరబోసిన మిర్చి మెత్తబడింది. నేలవాలిన పంట పొలాలను చూసి కర్షకులు కన్నీరు పెడుతున్నారు. మూడు రోజులు వరుసగా ప్రకృతి కోపానికి రైతులు దిక్కులు చూస్తున్నారు.

ప్రాథమిక అంచనాలే..

వరుసగా మూడు రోజులుగా గాలి, వానలతో పంటలకు నష్టం జరుగుతూనే ఉంది. నష్టం జరిగిన తరువాత క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులవారీగా అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సిన అధికారులు ఇప్పటికీ ప్రాథమిక అంచనాలకే పరిమితమయ్యారు. నెల రోజుల కిందట జరిగిన ఈ దురుగాలుల నష్టాలను అంచనాలు వేసి నివేదిక పంపగా.. జిల్లాలో 192 ఎకరాల్లో నష్టం జరిగినట్లు ప్రభుత్వం నిర్ధారించింది. ఈమేరకు ఎకరానికి రూ.10వేలు పరిహారం వచ్చే అవకాశం ఉంది. ఇప్పుడు జరిగిన గాలివానా నష్టాలు అంచనా వేయాల్సిన వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సమన్వయ లోపంతో ఇంకా క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లనే లేదు.



నాంపల్లిలో నేలవాలిన వరిపంట



ఎల్లారెడ్డిపేటలో రాలిన వరిగింజలు

గాలివానకు రాలిన గింజలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల)/వేములవాడఅర్బన్/వేములవాడరూరల్/ఇల్లంతకుంట(మానకొండూరు): జిల్లా వ్యాప్తంగా సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. ఎల్లారెడ్డిపేట మండలంలో ఈదురుగాల వర్షానికి చేతికొచ్చిన వరి పంట నేలపాలైంది. గాలి బలంగా వీయడంతో వరి గింజలు నేలరాలాయి. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారం నెలకొంది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. ఇప్పటికే ఈ సీజన్‌లో పలుసార్లు కురిసిన వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మళ్లీ సోమవారం సాయంత్రం కురిసిన వర్షంతో ఎల్లారెడ్డిపేట, నారాయణపూర్, హరిదాస్‌గర్, వెంకటాపూర్, పదిర, దుమాల, గొల్లపల్లి, బొప్పాపూర్, కోరుట్లపేట, సింగారం గ్రామాల్లోని పంటలు నేలపాలయ్యాయి. వేములవాడ అర్బన్, వేములవాడరూరల్ మండలాల్లోని వరిపంటలు నేలవాలయ్యాయి. మామిడితోటలకు తీవ్రంగా నష్టం జరిగింది. ఫాజుల్‌నగర్, వట్టెంల, నూకలమర్రి గ్రామాల్లో వడగండ్ల వాన కురిసింది. ఇల్లంతకుంట మండలంలోని సోమారంపేట, రేపాక, వెంకట్రావుపల్లి, రహీంఖాన్‌పేట, గూడెపుపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో వడగండ్ల వాన పడింది.

జిల్లాలో పంట నష్టం వివరాలు (ప్రాథమిక అంచనా)	
వరి రైతులు :	507
విస్తీర్ణం :	650 ఎకరాలు
మామిడి రైతులు :	138
విస్తీర్ణం :	165 ఎకరాలు

నేడు బీఆర్‌ఎస్ ప్లీనరీ

- హాజరవుతున్న మంత్రి కేటీఆర్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో మంగళవారం బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకల ప్లీనరీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. టీఆర్‌ఎస్ పార్టీ బీఆర్‌ఎస్‌గా మారిన తర్వాత సిరిసిల్ల నియోజకవర్గస్థాయిలో ప్రజాప్రతినిధులు, పార్టీ క్రియాశీలక కార్యకర్తల కీలక సమావేశాన్ని పెద్దూరు వద్ద నిర్వహిస్తున్నారు. గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, ముస్తాబాద్, తంగళ్లపల్లి, సిరిసిల్ల పట్టణంలోని బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఐదు వేల మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈమేరకు సిరిసిల్ల రెండో బైపాస్‌రోడ్డులో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ప్లీనరీకి బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కె.తారక రామారావు, పార్టీ రాష్ట్ర స్థాయి ముఖ్యనాయకులు హాజరవుతున్నారు. భోజన వసతి కల్పించారు. రోజంతా మంత్రి కేటీఆర్ పార్టీ నాయకులతో గడిపేలా ప్రణాళిక రూపొందించారు. రానున్న ఎన్నికల కోసం పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు ఈ ప్లీనరీ నిర్వహిస్తున్నారు. సభ వేదికను భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌తో రూపొందించారు. ప్లీనరీ ఏర్పాట్లను ముఖ్య నాయకులు సోమవారం పరిశీలించారు.

రైతుల కోసం న్యాయ సలహా కేంద్రాలు



రైతు న్యాయ సలహా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి ప్రేమలత

ముస్తాబాద్(సిరిసిల్ల): రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.ప్రేమలత కోరారు. ముస్తాబాద్‌లో రైతు న్యాయసేవా కేంద్రాన్ని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. నకిలీ ఎరువులు, విత్తనాలు, పెస్టిసైడ్స్ సమస్యలపై న్యాయ సేవా కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ, ఏజీపీ రవీందర్‌రావు, సర్పంచ్ గాండ్ల సుమతి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గోపాల్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఏవో రణధీర్, తహసీల్దార్ మునీందర్, ఎంపీడీవో రమాదేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, లోక్ అదాలత్ సభ్యుడు శ్రీనివాస్, అడ్వకేట్లు ఉన్నారు.

ఇప్పటికైనా మేల్కొంటారా?



- మీరు చూస్తున్న ఈ దృశ్యం గత మార్చిలో సిరిసిల్లలో కురిసిన చిన్నపాటి వర్షానికి పాతబస్టాండు జలమయమైంది. ఎండాకాలంలోని కురిసిన చిన్నపాటి వర్షానికే వరద పరిస్థితి ఇలా ఉంటే.. వర్షాకాలంలో పరిస్థితిని ఊహించుకోవచ్చు. వరద మళ్లింపు పనులు ఏళ్ల కొద్దీ కొనసాగుతుండడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గతేడాది సిరిసిల్ల ఆసిఫ్‌పురలో వరద ఉధృతి(ఫైల్)

- ఈ దృశ్యం గతేడాది జూన్‌లో జిల్లా కేంద్రంలోని సంజీవయ్యనగర్‌ను వరద ముంచేసింది. వరదలతో పోటెత్తె సిరిసిల్లకు ఇదే సాక్ష్యం. గతేడాది వరద బీభత్సంతో పట్టణంలో కోట్ల రూపాయల ఆస్తి నష్ట జరుగగా.. ఒకర ప్రాణాలు కోల్పోయారు. అయితే మళ్లీ వర్షాకాలం మొదలయ్యే సమయానికి వరద ముప్పును తప్పించాలనే కనువిప్పు కలగడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.



- సిరిసిల్లను వీడని వరదల భయం
- ఆందోళనలో లోతట్టు ప్రాంత ప్రజలు
- కొనసా..గుతున్న మరమ్మతులు
- పట్టించుకోని అధికారులు

సిరిసిల్లటౌన్: చిరుజల్లులకే జిల్లా కేంద్రాన్ని వరద ముంచెత్తుతుంది. ఇటీవల మార్చిలో ముప్పై నిమిషాల పాటు కురిసిన వర్షానికే పాతబస్టాండ్ జలమయమైంది. ఎండాకాలంలో అప్పుడప్పుడు కురిసే చిన్నపాటి వర్షానికే ఇలా జలదృశ్యమైతే.. వర్షాకాలంలో పరిస్థితి ఏంటి.. అని జిల్లా కేంద్రంలోని లోతట్టు ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు గతంలో చేపట్టిన వరద మళ్లింపు పనులు ఇప్పటికీ కొనసాగుతుండడంపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ వేసవి ముగిసేలోపు వరద మళ్లింపు పనులు, ఇతర మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

దురాక్రమణలో 20 నాలాలు

సిరిసిల్లలోని కార్గిల్‌లేక్, రాయినిచెరువు, తుమ్మలకుంట, కొత్తచెరువు తదితర చెరువులకు సంబంధించినవి దాదాపు 20 నాలాలు దురాక్రమణకు గురయ్యాయి. డబ్బు, పలుకుబడి ఉన్న వారు అధికారులపై ఒత్తిడి తెచ్చి నాలాలను కబ్జా చేసేస్తున్నారు. దీంతో వర్షాలు కురిసిన ప్రతీసారి నివాసాల్లోకి వరద కొట్టుకొస్తుంది.

కొనసా...గుతున్న మరమ్మతులు

పట్టణంలోకి వరదలు రాకుండా రూ.2.50 కోట్లతో చేపట్టిన పనులు ఏడాదిగా కొనసాగుతున్నాయి. వెంకంపేట వద్ద దోబీఘాట్ ప్రహరీ నిర్మాణానికి రూ.30లక్షలు, కలెక్టరేట్ భవనం సముదాయం సమీపంలో ప్రహరీ నిర్మాణానికి రూ.75లక్షలు, పాడయిన రోడ్లు, డ్రెయినేజీల మరమ్మతులకు రూ.25 లక్షలు, సీసీరోడ్ల మరమ్మతుకు రూ.20లక్షలు, సిరిసిల్ల–కరీంనగర్ ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్ మరమ్మతుకు రూ.15లక్షలు, బీటీ రోడ్డు రిపేరుకు రూ.25లక్షలు, టౌన్–1, టౌన్–2 ఏరియాల్లో పాడయిన రోడ్లు, కాల్వలు, కల్వర్టుల మరమ్మతులకు రూ.60లక్షల చొప్పున కేటాయించారు. ప్రస్తుతం శాంతినగర్ ప్రాంతం నుంచి వరదకాల్వ పనులు చేపడుతున్నారు. అయితే పనులు పూర్తికాక పోవడంతో లోతట్టు ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆక్రమిత నాలాలను స్వాధీనం చేసుకోకుండా ప్రైవేటు భూముల్లోంచి కచ్చా నాలా నిర్మించడంపై విమర్శలు వస్తున్నాయి. చెరువుల మత్తడి కాల్వలను పునరుద్ధరిస్తే సమస్య పరిష్కారమవుతుందని స్థానికులు చెబుతున్నారు.

సమస్యలు..పరిష్కారాలు

- లోతట్టు ప్రాంతాలైన అంబికానగర్, వెంకంపేట, తారకరామానగర్, పద్మనగర్, అశోక్‌నగర్, అనంతనగర్, సర్దార్‌నగర్, సంజీవయ్యనగర్, ఆసిఫ్‌పుర, ఆటోనగర్, శాంతినగర్‌లలోకి వరద చేరకుండా చర్యలు తీసుకోవాలి.
- వరద మానేరులో కలిసేలా కాల్వ నిర్మించాలి.
- ప్రధాన డ్రెయినేజీ కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలి. డ్రెయినేజీల్లో సిల్టు పేరుకుపోకుండా శుభ్రం చేయాలి.
- ఇప్పటికే కబ్జాకు గురైన నాలాలను స్వాధీనం చేసుకొని, పునరుద్ధరించాలి.

పక్కా ప్రణాళికతో పరిష్కారం

సిరిసిల్లలో వరదల సమస్య తలెత్తకుండా పక్కా ప్రణాళికతో పరిష్కార చర్యలు చేపట్టాం. కొత్తచెరువు నుంచి వచ్చే మత్తడి నీరు శాంతినగర్ మీదుగా మానేరులోకి వెళ్లేలా కాల్వ నిర్మిస్తున్నాం. వెంకంపేట దోబీఘాట్ నుంచి కొత్తచెరువులోకి వరదనీరు పోయేలా నాలా నిర్మించాం. కొలనూరు నుంచి ఈదుల చెరువు ద్వారా కలెక్టరేట్ ప్రాంతానికి వచ్చే నీరును ఇతర మార్గం ద్వారా మానేరులో కలిపేలా ఇరిగేషన్ శాఖ చర్యలు తీసుకుంది.

– వెల్దండి సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్

ఏ ఒక్కటీ వదలొద్దు

- 13 అసెంబ్లీ స్థానాలపై గులాబీ పార్టీ గురి
- 2014లో జగిత్యాల, 2018లో మంథని దూరం
- ఈసారి పాత జిల్లా క్లీన్‌స్వీప్ చేయాలని బీఆర్‌ఎస్ నిర్ణయం
- అభివృద్ధి వివరిస్తూనే బీజేపీపై ఎదురుదాడికి ప్రణాళికలు
- సోషల్ మీడియా సమగ్ర వినియోగంపై దృష్టి

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాలోని 13 అసెంబ్లీ స్థానాలు కైవసం చేసుకోవాలని కారు పార్టీ ప్రణాళికలు రచిస్తోంది. టీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి నేడు బీఆర్‌ఎస్ పార్టీగా రూపాంతరం చెందడం వరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో విడదీయలేని అనుబంధం ఉంది. పార్టీ తొలి ఆవిర్భావ సభ నుంచి తెలంగాణ కోసం ఆమరణ నిరాహార దీక్ష వరకు.. ఇలా ఏది ప్రారంభించినా.. కరీంనగర్ నుంచి మొదలుపెట్టడం సీఎం కేసీఆర్‌కు సెంటిమెంటు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలైన రైతుబంధు, దళితబంధు పథకాలను కరీంనగర్ జిల్లా నుంచే ప్రారంభించడం గమనార్హం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 13 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. రాష్ట్రం ఆవిర్భవించాక రెండుసార్లు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. 2014 ఎన్నికల్లో కరీంనగర్‌లో జగిత్యాల (జీవన్‌రెడ్డి) మినహా మిగిలిన అసెంబ్లీ స్థానాలు కారు పార్టీ కైవసం చేసుకుంది. 2018లో జరిగిన ముందస్తు ఎన్నికల్లోనూ కారు పార్టీ మంథని (శ్రీధర్‌బాబు) మినహా 12 అసెంబ్లీ స్థానాల్లో విజయబావుటా ఎగురవేసింది. క్లీన్‌స్వీప్ చేయాలన్న ప్రతీసారి కాంగ్రెస్ కారు పార్టీ ఆశలపై నీళ్లు చల్లుతూ వస్తోంది. ఈసారి ఎలాగైనా మొత్తం స్థానాలు సాధించాలని వ్యూహరచన చేస్తోంది. ఇందుకు 25న జరిగే నియోజకవర్గాల ప్లీనరీలను వేదికగా చేసుకుని కార్యకర్తలను కార్యోన్ముఖులను చేసేందుకు సిద్ధమవుతోంది. అన్ని స్థానాల్లోనూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం చేసిన పనులు వివరించడం, బీజేపీ నిధులు, విధుల విషయంలో అడ్డుపడుతున్న తీరును ప్రజలకు తెలియజేయాలని పలు తీర్మానాలను, నిర్ణయాలను ఆమోదించేందుకు సిద్ధమవుతోంది.

కీలక తీర్మానాలివే..!



- వ్యవసాయం రైతు సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టులు, కాళేశ్వరం తదితర ప్రాజెక్టులు.
- **సామాజిక భద్రత:** సమాజంలో పలువురుకు అందజేస్తున్న పింఛన్లు.
- **మహిళా సాధికారత:** సంఘాలు–రుణాలు, పింఛన్లు, షాదీముబారక్ తదితరాలు.
- **బీసీ సంక్షేమం:** గొర్రెల పంపిణీ, మత్స్యకారులు, చేనేత, గీతాకారులు ఇతర కులవృత్తుల సంక్షేమం, రుణాలు మొదలైనవి.
- **దళితసంక్షేమం:** దళితబంధు, గురుకులాలు.
- **గిరిజన సంక్షేమం:** తండాల పంచాయతీలుగా అప్‌గ్రేడ్, రిజర్వేషన్లు, మిషన్ భగీరథ తాగునీరు
- **విద్య– ఉద్యోగం:** గురుకులాలు, మోడల్‌స్కూళ్లు, మన ఊరు–మనబడి, హైదరాబాద్‌లో ఉపాధి అవకాశాల సృష్టి.
- పట్టణ ప్రగతి/పల్లె ప్రగతి.
- మైనార్టీ వెల్ఫేర్
- ధరల పెరుగుదల మోదీ వైఫల్యం.
- తెలంగాణపై వివక్ష
- విభజన హామీల అమలు
- సింగరేణి గనుల వేలం
- కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులు, వేధింపులపై కీలకమైన నేతలతోపాటు సాధారణ కార్యకర్తలను సిద్ధం చేసేందుకు 13 నియోజకవర్గాల్లో జరిగే ప్లీనరీలను వేదికగా ఎంచుకుంది.

సోషల్ మీడియా వినియోగం..!

పార్టీ 13 స్థానాలను సాధించే క్రమంలో మొత్తం బాధ్యతలను జిల్లా మంత్రులు, జిల్లా పార్టీ ఇన్‌చార్జులు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులకు అప్పగించింది. పక్కా వ్యూహంతో బీజేపీ, కాంగ్రెస్‌ల తీరును ఎండగడుతూ.. బీఆర్‌ఎస్ చేపట్టిన అభివృద్ధి పనులు, పూర్తి చేసిన పనులకు శంకుస్థాపనలు ప్రజలకు చేరేలా వ్యవహరించాలని అధిష్టానం ఆదేశించింది. ఇందుకోసం ప్రధాన మీడియాతోపాటు సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాలను వినియోగించుకోవాలని, ఇందుకు సోషల్ మీడియా వారియర్‌లను పల్లెలు, మండలాలు, నియోజకవర్గాల వారీగా బలోపేతం చేయాలని ఆదేశించింది. పార్టీ చేపట్టిన కార్యక్రమాలతోపాటు, ప్రతిపక్షాల విమర్శలకు ఎదురుదాడి కూడా అంతే దూకుడుగా ఉండాలని, ఆరోపణలను ఎండగట్టేలా సోషల్‌మీడియాను పూర్తిస్థాయిలో వాడుకోవాలని సూచించింది.

క్లుప్తంగా

బీసీ కులగణన వెంటనే చేపట్టాలి



మాట్లాడుతున్న రవిగౌడ్

సిరిసిల్లటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడిన వర్గాలను ఆదినుంచీ చిన్నచూపు చూస్తున్నాయని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కో–ఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ ఆరోపించారు. సోమవారం సిరిసిల్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంటనే బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాల తీరును నిరసిస్తూ అన్ని పార్టీల మద్దతుతో ఉద్యమం చేపడుతామన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ బీసీ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సంఘం డివిజన్ ఇన్‌చార్జి ఇల్లందుల ప్రకాశ్, నాయకులు నవీన్, రుద్రవేని సుజాత, తరుణ్, రాహుల్, పవన్, విజయ్, వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

నాసిరకంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు

- బీజేపీ నాయకుల ఆందోళన



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం కొండాపూర్‌లో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు నాసిరకంగా ఉన్నాయని బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చిగురు వెంకన్న ఆరోపించారు. కొండాపూర్ డబుల్‌బెడ్ రూం ఇళ్ల పనులను సోమవారం బీజేపీ నాయకులు పరిశీలించారు. నాసిరకం పనులు జరుగుతున్నాయని ఆందోళన చేపట్టారు. ప్రారంభానికి ముందే స్లాబ్ పెచ్చులు ఊడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నాణ్యత లేని పనులపై మంత్రి కేటీఆర్ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. పనులు త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలన్నారు. గాగిల్లపురం అనిల్, కనమేని లింగారెడ్డి, తాటిపల్లి ప్రణీత్ రెడ్డి, గంధం అజయ్, భరత్‌రెడ్డి ఉన్నారు.

బలగం చూసి.. యాదాద్రీశుడి చెంతకు



ప్రసాద విక్రయశాల వద్ద ఉన్న మెట్లపై కూర్చున్న అనంతగిరి గ్రామస్తులు

యాదగిరిగుట్ట: బలగం సినిమా.. దూరమైన ఆత్మీయ బంధాలు, ఏళ్లుగా విడిపోయిన కుటుంబాలను కలుపుతోంది. అలాగే ఈ సినిమా చూసి ఓ ఊరంతా కలిసి ఉండేందుకు ఒక వేదికను ఏర్పాటు చేసుకునేందు ఆ గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చారు. ఇల్లంతకుంట మండలం అనంతగిరిలో ఇటీవల సర్పంచ్ నర్సింహారెడ్డి బలగం సినిమాను ప్రదర్శించారు. ఈ సినిమాను చూసిన గ్రామస్తులంతా ఆవేదనకు గురై, కన్నీరు పెట్టుకున్నారు. అప్పుడే గ్రామస్తులంతా అక్కడ ఉన్న సర్పంచ్ నర్సింహారెడ్డిని కలిసి అందరం మంచిగా ఉండాలంటే యాదగిరి నర్సన్న దగ్గరికి పోయొద్దాం అంటూ బయలుదేరారు. సోమవారం సుమారు 200లకు పైగా మంది అనంతగిరి గ్రామస్తులు యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు.

టెక్ పోలీసింగ్

- పోలీసుల పనితీరు బేరీజు
- నేరాల నియంత్రణకూ వినియోగం
- సాంకేతికతతో ముందుకెళ్తున్న ఖాకీలు
- జిల్లాలో విస్తృత ప్రచారం

సిరిసిల్లక్రైం: నేరాల నియంత్రణ.. పోలీసు సిబ్బంది పనితీరు బేరీజు వేసేందుకు జిల్లా పోలీసులు టెక్నాలజీని వినియోగిస్తున్నారు. మొన్నటి వరకు సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల్లోని నిందితులను పట్టుకుంటున్న పోలీసులు ఇప్పుడు మరింత మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు అభివృద్ధి చెందిన టెక్నాలజీని వినియోగిస్తున్నారు. సైబర్ నేరాల నియంత్రణ, మహిళల రక్షణ, మానవ అక్రమ రవాణా నివారణ వంటి కేసుల ఛేదనకు సాంకేతికతను వాడుకుంటున్నారు. ఫోన్ చోరీకి గురైతే ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయడం ద్వారా త్వరగా పట్టుకుంటున్నారు. జిల్లా ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తనకు తెలిపేందుకు 'మెస్సేజ్ యువర్ ఎస్పీ' విధానాన్ని కొనసాగిస్తున్నారు.



సీఈఐఆర్ విధానాన్ని ఉపయోగించి సెల్‌ఫోన్ రికవరీ చేసి వినియోగదారుడికి ఇస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సైబర్‌నేరాల విషయంలో..

మనిషికి ఉన్న ఆర్థిక అత్యాశను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు వివిధ యాప్‌ల పేరిట జనాలను మోసం చేస్తున్నారు. గతంలో బ్యాంకు అధికారులమంటూ ఫోన్ చేసి బ్యాంకు డెబిట్ కార్డు నంబర్ తెలుసుకొని నగదు కాజేసేవారు. అంతేకాకుండా ఏటీఎం సెంటర్ వద్ద పిన్ ఎంటర్ చేస్తామని నమ్మించి నగదు విత్‌డ్రా చేసుకున్న సంఘటనలు చూశాం. కానీ నేడు వాటికి మించి వివిధ వస్తువుల కొనుగోలు, చైన్‌సిస్టమ్ పనిలో అవకాశాల పేరిట లక్షల రూపాయలను సైబర్ నేరగాళ్లు కొల్లగొడుతున్నారు. జిల్లాలోని వివిధ ఠాణాల్లో వారానికి కనీసం 3 నుంచి 5 సైబర్ నేరాల కేసులు నమోదవుతున్నట్లు పోలీసు గణాంకాలు చెబుతున్నాయి. ఇలాంటి సైబర్ నేరాలు జరిగినప్పుడు బాధితులు వెబ్‌సైట్‌లో NCQP (www.cybercrime.gov.in) వెబ్‌సైట్‌లో లేదా 1930 టోల్‌ఫ్రీ నంబర్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు. సైబర్ నేరాలు జరిగిన మొదటి గంట పరిధిలో ఫిర్యాదు చేస్తే బాధితుల నగదు లావాదేవీలను నిలిపివేయవచ్చంటున్నారు.

మొబైల్ పోతే..

నేటి కాలంలో ఫోన్ వినియోగం తప్పనిసరిగా మారింది. కొన్ని ఫోన్‌లు లక్షల రూపాయాల విలువ చేస్తున్నాయి. ఇలాంటి ఫోన్ ఎక్కడైన మరిచినా.. ఎవరైనా దొంగిలించినా దాన్ని గుర్తించడం తలకుమించిన భారంగా ఉండేది. కానీ నేడు పరిస్థితులు మారాయి. ఏదేని ఫోన్ కొనుగోలు చేయగానే 'సీఈఐఆర్' అప్లికేషన్ విధానంలో పోయిన ఫోన్ దొరకబట్టడం సులభం. ఫోన్ వినియోగదారుడు 'సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్' అనే అప్లికేషన్‌లో ఫోన్‌కు సంబంధించి ఐఎంఈఐ నంబర్ నమోదు చేయాలి. ఇలా చేస్తే ఫోన్ దొంగిలించిన వ్యక్తికి ఆ ఫోన్ పనికి రాకుండా చేయవచ్చు. అంతేకాకుండా దొంగతనం చేసిన వ్యక్తి లేనిపక్షంలో అతను ఏ సిమ్ కార్డు వాడిన సంబంధిత వివరాలను తెలిసి పోలీసులు పట్టుకునేందుకు అవకాశం ఉంది.

పోలీసు పనితీరును బేరీజు వేసేందుకు..

ఫిర్యాదు చేయడానికి వచ్చిన వారితోపాటు కేసు నమోదు దాని దర్యాప్తులో పోలీసులు ప్రజలతో ఎలా ఉంటున్నారని తెలుసుకునేందుకు ఎస్పీ అఖిల్‌మహాజన్ కొత్త విధానం అమలు చేస్తున్నారు. ప్రతీ ఠాణా ఆవరణలో క్యూఆర్ కోడ్ స్టిక్కర్ అతికించి దాన్ని స్కాన్‌చేసి ఆ ఠాణాలోని పోలీసుల పనితీరును ప్రజలు తనకు తెలిసేలా చేయడానికి అవకాశం కల్పించారు. ఈ స్కానర్‌తో చేసిన సలహాలు, సూచనలు, పోలీసులపై ఫిర్యాదులను తానే స్వయంగా పరిశీలించి మార్పు చేర్పులు చేస్తానని తెలిపారు. ఇలాంటి విధానాలతో ప్రజలకు మరింత పారదర్శకంగా సేవలు పోలీసు అధికారులు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఫోన్‌లో ఫిర్యాదులకు విస్తృత అవకాశాలు

ప్రజలకు ఉన్న ఎలాంటి సమస్యనైన వివరించి తక్షణ సహాయం పొందడానికి 'డయల్ 100' అందుబాటులో ఉన్న విషయం తెలిసింది. దీనికి తోడుగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రజల సమస్యలను మెసేజ్ రూపంలో తీసుకునేందుకు 'మెసేజ్ యువర్ ఎస్పీ' 63003 922572 నంబర్ కేటాయించారు. మహిళల రక్షణకు షీటీం బృందానికి 87126 56425 నంబర్‌ను, ఎస్సై స్థాయి అధికారికి విధులు కేటాయించారు. గల్ఫ్ బాధిత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 87126 56411లో సీఐ అధికారిని అందుబాటులో ఉంచారు. నెలలో మొదటి మంగళవారం జిల్లాలోని ఏదేని ఒక ఠాణాలో ప్రజల వద్దకు వెళ్లి ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించడం కోసం ఠాణా దివస్‌ను ఏర్పాటు చేశారు.



పోలీసుల పనితీరు ప్రజలే తెలిపేందుకు ఠాణాలో అతికించిన క్యూఆర్ కోడ్ స్టిక్కర్

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించండి

- పంట నష్టం అంచనా వేయండి
- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రా రంభించాలని అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్ కోరారు. కలెక్టరేట్‌లో పౌరసరఫరాల అధికారులతో కలిసి సోమవారం రైస్‌మిల్లర్లతో సమీక్షించారు. జిల్లాలో 256 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాల్సి ఉండగా.. ఇప్పటికే 134 ప్రారంభించినట్లు తెలిపారు. రైతులను ఇబ్బందులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్, రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలి..

జిల్లాలో జరిగిన పంట నష్టాన్ని అంచనా వేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి టెలీకాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. హైదరాబాద్ నుంచి సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో మా ట్లాడారు. జిల్లాలో ప్రాథమికంగా 507 మంది రైతులకు సంబంధించి 655 ఎకరాల్లో వరి, 138 మంది రైతులకు సంబంధించి 165 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం జరిగిందన్నారు. ఇంకా క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించిన పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని సీఎస్ ఆదేశించారు. జిల్లా వ్యవసాయాధికారి రణధీర్‌రెడ్డి, సీపీవో శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

వేములవాడ బీఆర్‌ఎస్‌లో ఫ్లెక్సీ లొల్లి



వేములవాడలో చల్మెడ లక్ష్మీనర్సింహారావు జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



కౌన్సిలర్ విజయ్‌ని ఠాణాకు రమ్మని అర్ధరాత్రి ఇంటికొచ్చిన కానిస్టేబుల్

వేములవాడ: వేములవాడలోని బీఆర్‌ఎస్ పార్టీలో ఫ్లెక్సీ కలకలం మొదలైంది. చల్మెడ లక్ష్మీనర్సింహారావు జన్మదినాన్ని పురస్కరించుకొని 3వ వార్డు కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్ పట్టణంలోని పలు కూడళ్లలో ఈనెల 23న ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ ప్రధాన నాయకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విజయ్‌ని ఠాణాకు పిలిపించారు. ఈ తతంగంపై సొంత పార్టీలో చర్చ ఊపందుకుంది.

హక్కులను కాలరాస్తున్నారు : విజయ్

అభిమాన నాయకుడు లక్ష్మీనర్సింహారావు జన్మదినం సందర్భంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తే అదే రోజు అర్ధరాత్రి ఠాణాకు పిలిపించడంపై కౌన్సిలర్ విజయ్ మనస్థాపానికి గురయ్యారు. సొంత పార్టీ నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపే హక్కు లేదా.. అని సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రశ్నించారు. అర్ధరాత్రి ఇంటికి పోలీసులు రావడంతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారన్నారు.

పరువు నష్టం దావా వేస్తాం : ఎమ్మెల్యే పీఏ శ్రీనివాస్

ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఫొటోలను, వీడియోలను దుర్వినియోగం చేస్తే పరువునష్టం దావా వేస్తామని ఎమ్మెల్యే పీఏ శ్రీనివాస్ ప్రెస్‌నోట్ విడుదల చేశారు. ఈ విషయం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది.

జేఎల్‌ఆర్ ట్రస్టు చైర్మన్ హఠాన్మరణం



వెంకటేశ్వర్‌రావు (ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని నామాపూర్‌కు చెందిన ప్రముఖ సామాజికవేత్త, జేఎల్‌ఆర్ ట్రస్టు చైర్మన్ జూకంటి వెంకటేశ్వర్‌రావు మృతిచెందారు. కామారెడ్డిలో సోమవారం తెల్లవారుజామున అస్వస్థతకు గురై చనిపోయినట్లు ఆయన కుటుంబీకులు తెలిపారు. వెంకటేశ్వర్‌రావు 2002లో జేఎల్ ఆర్ ట్రస్టు స్థాపించి, వందలాది మందికి కంటి ఆపరేషన్లు చేయించారు. సిరిసిల్ల నియోజకవర్గంలో వందల సంఖ్యలో వైద్యశిబిరాలు నిర్వహించారు. 21 ఏళ్లుగా 30 మంది నిరుపేద మహిళలు, వృద్ధులకు ప్రతినెలా రూ.300 చొప్పున పెన్షన్ అందిస్తున్న గొప్ప మానవతావాది. విద్యాలయాల అభివృద్ధికి, నిరుపేదల చదువులకు లక్షల రూపాయలు వెచ్చించారు. పలువురికి ఇళ్లు నిర్మించి, ఇచ్చారు. కోవిడ్ సమయంలో పేదలకు అండగా నిలిచారు. వెంకన్న మృతి విషయం తెలుసుకొని, పింఛన్లు పొందుతున్నవారు రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఆయన మృతదేహాన్ని నామాపూర్‌లోని స్వగృహానికి తరలించారు. జెడ్పీటీసీ సభ్యుడు నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఆర్‌బీఎస్ అధ్యక్షుడు గోపాల్‌రావు, సర్పంచ్‌లు విజయ, జ్యోతి, మాజీ సర్పంచ్ గాడిచర్ల దేవయ్య, సురేందర్‌రావు, ట్రస్టు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు సోమవారం నివాళి అర్పించారు. కెనడాలో ఉన్న వెంకన్న కుమారుడు వచ్చాక అంత్యక్రియలు నిర్వహిస్తామని ట్రస్టు సభ్యులు తెలిపారు.

దుబాయిలో నాగారంవాసి మృతి



వెంకటేశ్ (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): నాగారం గ్రామానికి చెందిన కీసరి వెంకటేశ్(48) దుబాయిలో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. వెంకటేశ్ 20 ఏళ్లుగా దుబాయిలోని మైన్స్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు ఇదివరకు ఒకసారి గుండెకు సంబంధించిన ఆపరేషన్ జరిగింది. అప్పుడు కుటుంబసభ్యులు దుబాయి వెళ్లి, కొన్ని రోజులు అతని వద్దే ఉన్నారు. ఖర్చులు ఎక్కువవడంతో తిరిగి స్వగ్రామం వచ్చారు. ఈ క్రమంలో శనివారం రాత్రి 10.30 గంటలకు గుండెనొప్పి రావడంతో వెంకటేశ్ స్నేహితులు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన అక్కడి వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య లావణ్య, ఇద్దరు కూతుళ్లు వర్ష, వందన ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఆద్య గోలి ఫౌండేషన్ చైర్మన్ మోహన్, నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి లక్ష్మణ్, లీగల్ అడ్వైజర్ కీసరి శ్రీనివాస్ తదితరులు సోమవారం పరామర్శించారు. మృతదేహం మంగళవారం ఇంటికి చేరుతుందని బాధిత బంధువులు తెలిపారు.

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

- కేసీఆర్ అరాచకాలకు అంతం పలుకుదాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కుమార్



కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన బండి సంజయ్‌కుమార్

కరీంనగర్‌టౌన్: తెలంగాణలో అధికారంలోకి రాబోయేది బీజేపీయేనని, కేసీఆర్ నియంత, అవినీతి, కుటుంబ అరాచకాలకు అంతం పలకడమే లక్ష్యంగా పార్టీ పోరాడుతోందని, రామరాజ్యం కోరుకునేవాళ్లంతా బీజేపీలో చేరాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. సిరిసిల్ల నియోజకవర్గం గంభీరావుపేట మండలం జగదంబ తండా గ్రామ ఉప సర్పంచ్ ప్రమీల, వార్డ్ మెంబర్స్, రాజమణి, సోనా, అమృత, సరిత, సక్రి తోపాటు సుమారు వందమంది కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో సోమవారం సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరగా, వీరందరికీ కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ, కేసీఆర్ పాలనలో ఏ ఒక్క వర్గం సంతోషంగా లేదని, టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్‌తో 30 లక్షల మంది నిరుద్యోగుల భవిష్యత్తు అంధకారంలో పడిందన్నారు. వడగండ్ల వానతో పంట నష్టపోయి రైతులు అల్లాడుతుంటే కేసీఆర్ మాత్రం ఇతర రాష్ట్రాల్లో బహిరంగ సభల పేరుతో రాజకీయాలు చేస్తున్నారే తప్ప రైతులను ఆదుకున్న పాపాన పోలేదన్నారు. కేసీఆర్ పాలనకు చరమగీతం పలకాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిబోయిన గోపి, మండల అధ్యక్షుడు గంట అశోక్, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు తిరుపతి, ఓబీసీ అధ్యక్షుడు ఆకుల మురళీమోహన్‌గౌడ్, కిసాన్ మోర్చా అధ్యక్షులు, కోడె రమేష్, మహేశ్‌యాదవ్, అయోధ్య రవి, మద్దుల రాజిరెడ్డి, భాస్కర్‌నాయక్, శ్రవణ్‌యాదవ్, కొక్కు దేవేందర్‌యాదవ్, అన్వర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

చివరి గింజ వరకు ప్రభుత్వమే కొంటుంది

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కనగర్తిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట(వేములవాడ): రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వమే కొంటుందని రైతులు ఆందోళన చెందొద్దని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. మండలంలోని కనగర్తి, కొలనూర్‌లో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. రైతుల శ్రేయస్సు, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. రైతులను రాజు చేయాలనే ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి రూ.2,060 మద్దతు ధర పొందాలని సూచించారు. సర్పంచులు అనుపాటి భారతి, యమున, సింగిల్‌విండో చైర్మన్లు బండ నర్సయ్య, సంకినేని రామ్మోహన్‌రావు, వైస్‌చైర్మన్లు అనుపాటి భూంరెడ్డి, కాశవేణి మహేశ్, ఎంపీడీవో రామకృష్ణ పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి

కోనరావుపేట(వేములవాడ): గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. కోనరావుపేట మండలంలోని సుద్దాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంధరహిత సమాజ నిర్మాణం కోసం సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడాలేని విధంగా కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. గ్రామస్తులకు వైద్యుల పర్యవేక్షణలో కంటి పరీక్షలు నిర్వహించి, మందులు, కళ్లద్దాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. కంటి సమస్యలు తీవ్రంగా ఉన్నవారికి అవసరమైతే ఆపరేషన్ సైతం ఉచితంగా చేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పుల దేవలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కాశవేణి మమత, ఉపసర్పంచ్ ఎరవెల్లి నాగరాజు, ఎంపీడీవో రామకృష్ణ, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కార్డన్‌సెర్చ్

- వన్యప్రాణులను వేటాడితే జైలుకే
- వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి
- కాగితాలు లేని వాహనాలు, కత్తులు స్వాధీనం



మారణాయుధాలను పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐలు

చందుర్తి(వేములవాడ): నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. బండపల్లిలో సోమవారం వేకువజామునే గ్రామంలోని ఇంటింటికి వెళ్లి సోదాలు చేశారు. రిజిస్ట్రేషన్ పేపర్లు లేని 45 బైక్‌లను, కత్తులను, అక్రమంగా నిల్వ చేసిన కలపను, వలలు, అటవీ జంతువులను వేటాడేందుకు వినియోగించే ఇనుప చువ్వలను, విద్యుత్‌షాక్ పెట్టేందుకు వినియోగించే ఇనుప తీగలను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ వన్య ప్రాణులను వేటాడడం మానుకోకపోతే జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు కట్టడి చేయాలని సూచించారు. మైనర్‌లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. చందుర్తి సీఐ అచ్చ కిరణ్‌కుమార్, చందుర్తి, వేములవాడరూరల్, కోనరావుపేట, రుద్రంగి ఎస్సైలు రమేశ్, నాగరాజు, రమాకాంత్, ప్రభాకర్, 150 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కోడెమొక్కుల స్వామికి కోటి దండాలు



వేములవాడ: 'కోడెమొక్కుల స్వామికి కోటి దండాలు.. రాజన్నా దీవించు..' అంటూ భక్తులు వేడుకున్నారు. రాజన్నను సోమవారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులతో కలసి వచ్చిన భక్తులు కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ద్వారా రూ.25 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ప్రజావాణి ఫిర్యాదులకు పరిష్కారమేదీ?

- కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలి
- పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్



నిరసన తెలుపుతున్న శ్రీనివాస్, నాయకులు



బాధితుల సమస్య వింటున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్లటౌన్: ప్రతీ సోమవారం ప్రజావాణిలో ప్రజలు చేసే ఫిర్యాదులు పరిష్కారానికి నోచుకోవడం లేదని పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అర్జీలపై కలెక్టర్ కిందిస్థాయి అధికారులను ఆదేశిస్తున్నారు కానీ.. వాటిలో ఎన్ని పరిష్కారం అవుతున్నాయో ఒకసారి పరిశీలన చేయాలని కోరారు. అధికారులు దరఖాస్తులు తీసుకొని, వదిలేయడం వల్లే బాధితులు తమ సమస్యలపై మళ్లీమళ్లీ ఫిర్యాదు చేస్తున్నారని పేర్కొన్నారు. మార్చి 27న తాము ఇచ్చిన ఫిర్యాదుపై ఇప్పటివరకు ఎలాంటి సమాధానం ఇవ్వలేకపోవడం ఇందుకు నిదర్శనమన్నారు. సమితి ప్రతినిధులు బలరాం, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

తరుగు కేజీ మాత్రమే తీయాలి

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని భారతీయ కిసాన్ సంఘ్ కోరింది. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రతినిధులు నిరసన తెలిపారు. ధాన్యం తూకం వేసిన వెంటనే రైతులకు రసీదు ఇవ్వాలని, 40 కేజీలకు కేజీ తరుగు మాత్రమే తీయాలని, అన్ని కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు నీడ, ఇతర మౌలిక వసతులు కల్పించాలంటూ కలెక్టర్ ఆఫీసులో వినతిపత్రం అందించారు. బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు పులి లక్ష్మీపతిగౌడ్, కార్యదర్శి శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడద తీర్చాలి..

జిల్లా కేంద్రం పరిధిలోని రాజీవ్‌నగర్‌లో కోతుల బెడద తీర్చాలని స్థానికులు సోమవారం కలెక్టర్‌కు విన్నవించారు. వానరాలు నిత్యం తమపై దాడులు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లలోకి చొరబడి వంటలు, ఇతర వస్తువులను ఎత్తుకెళ్తున్నాయని వాపోయారు. చాలామంది వాటి దాడిలో గాయపడ్డారని, తమను రక్షించాలని కోరారు. శ్రీనివాస్, రామస్వామి, మహేశ్వరి, లలిత, అంజలి, లావణ్య తదితరులున్నారు.

ప్రజావాణికి 28 దరఖాస్తులు

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆసరా పెన్షన్లు, డబుల్ బెడ్రూం ఇళ్లకు దరఖాస్తులు ఎక్కువగా వస్తున్నాయి. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 28 అర్జీలు రాగా.. అందులో ఎక్కువగా పెన్షన్లు, డబుల్ బెడ్రూం ఇళ్లు కావాలనే ఉన్నాయి. భూ సమస్యలపై 6 ఫిర్యాదులు అందాయి. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇవ్వాలని మరో ఐదు అర్జీలు వచ్చాయి. ప్రజావాణి ఫిర్యాదులపై సత్వరం స్పందించి, పరిష్కారం చూపాలని జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. వేములవాడ ఆర్డీవో పి.పవన్‌కుమార్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కొమురయ్య, జౌళిశాఖ ఏడీ సాగర్, పరిశ్రమల శాఖ జీఎం ఉపేందర్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్, కలెక్టరేట్ పర్యవేక్షకులు గంగయ్య, శ్రీకాంత్, సిరిసిల్ల తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.